క్లుప్తంగా

నేడు స్పందన కార్యక్రమం

నందిగామ : స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో రవీంద్రరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రభుత్వం ఈ స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. డివిజన్ పరిధిలోని ప్రజలు ఆయా సమస్యల పరిష్కారం కోసం అర్జీలు అందజేయవచ్చని ఆర్డీవో రవీంద్రరావు సూచించారు.

కంచికచర్లలో...
కంచికచర్ల : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం పదిగంటలకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సుస్వాగతం తెలిపారు. మండల ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేస్తే, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని వివరించారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ కోరారు.

శాస్త్రోక్తంగా పూర్ణాహుతి

ముక్త్యాల(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న భవానీ ముక్తేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారికి పుట్నాలు దంచుట, వసంతసేవ, దొంగల తోపు ఉత్సవం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అర్చకులు వారణాసి సాంబశివరావు, జొన్నాబొట్ల కిషోర్‌శర్మ, ప్రేమ్ కుమార్‌శర్మ, లక్ష్మీనరసింహాచార్యులు ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో జయప్రకాష్‌బాబు, కేసీపీ ప్రతినిధి రాంప్రసాద్, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముగిసిన కల్యాణోత్సవాలు



నందిగామ: మండలంలోని దాములూరు కూడలి సంగమేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవాలు వైభవంగా ముగిశాయి. ఉత్సవాల చివరిరోజైన ఆదివారం స్వామివారికి విశేష అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయంలోని పార్వతీమాతకు ప్రత్యేక కుంకుమార్చనలు చేశారు. అనంతరం పూర్ణాహుతి, వసంతోత్సవ కార్యక్రమాలు వైభవంగా సాగాయి. వేదపండితుడు దాములూరి శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో పూర్ణాహుతి కార్యక్రమాలు ముగిశాయి. పూజా కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ కనగాల వెంకటేశ్వరరావు, ఈవో భూపాల్, భక్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీసు కవాతు



వీరులపాడు: ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతిఒక్కరూ సహకరించాలని నందిగామ రూరల్ సీఐ చంద్రశేఖర్ కోరారు. మండలంలోని పెద్దాపురం, జుజ్జూరు గ్రామాల్లో ఆదివారం పోలీస్ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. ముఖ్యంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. రాజకీయపార్టీల నాయకులు సైతం ఎన్నికల అధికారులకు సహకరించాలని కోరారు. నేర చరిత్ర కలిగిన వారిపై నిఘా ఉంటుందన్నారు. ఘర్షణ వాతావరణం సృష్టించేందుకు యత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ మహాలక్ష్మణుడు, ప్రత్యేక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయం ప్రారంభం



పెండ్యాల(కంచికచర్ల) : గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అత్యుత్తమ పౌరసేవలు అందిస్తున్నారని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు కొనియాడారు. మండలంలోని పెండ్యాలలో రూ.40లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని శనివారం రాత్రి ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ పెండ్యాలలో రెండు గ్రామసచివాలయాలను నిర్మించామన్నారు. గత ప్రభుత్వాల హయాంలో ఆదాయ, నివాస, కులధ్రువీకరణపత్రాల కోసం మండల కేంద్రాలకు వెళ్లే పరిస్థితి ఉండగా..సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి గ్రామ పొలిమేర దాటే పనిలేకుండా అన్నిరకాల ధ్రువీకరణపత్రాలను అందజేస్తున్నారనే విషయాన్ని ప్రజలు గుర్తించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, వైస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు, పరిటాల సర్పంచి యద్దనపూడి ఆనందజ్యోత్స్న, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ షహనాజ్‌బేగం, మాజీ సర్పంచి షేక్ ఖాజాపాషా, నాయకులు షేక్ సయ్యద్ మహ్మద్, పరిటాల రాము, షేక్ గౌస్, షేక్ హుస్సేన్, వేల్పుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మోగులూరులో అభివృద్ధి మోత

- డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా రూ.45.17 కోట్ల నిధులు
- నవరత్న పథకాలతో అన్నివర్గాలకు మేలు
- అంతర్గత గ్రావెల్ రోడ్లన్నీ సిమెంటురోడ్లుగా అభివృద్ధి



మోగులూరులో కార్పొరేట్ స్థాయిలో నిర్మిస్తున్న జెడ్పీ పాఠశాలలోని అదనపు తరగతి గదులు



మోగులూరులో నిర్మించిన సచివాలయం



బీసీ కాలనీలో నిర్మించిన సిమెంటు రోడ్డు

కంచికచర్ల : గత ప్రభుత్వంలో సమస్యలతో కొట్టుమిట్టాడిన మోగులూరు గ్రామం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ఈ నాలుగేళ్ల పది నెలల కాలంలో ఎంతో అభివృద్ధి చెందింది. గ్రామంలోని అన్నివీధుల్లో అంతర్గత గ్రావెల్ రోడ్లన్నీ సీసీ రోడ్లుగా అభివృద్ధిచేయడంతోపాటు డ్రైనేజీల నిర్మాణం చేపట్టారు. ఇంటింటికీ కుళాయి పథకం ద్వారా అన్ని ఇళ్లకు నిత్యం తాగునీరు సరఫరా చేస్తున్నారు. నవరత్న పథకాలతో అన్ని వర్గాల ప్రజలు లబ్ధిపొందారు.

రూ.5కోట్లతో అదనపు తరగతి గదులు..
నాడు–నేడు పథకం కింద గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా తీర్చిదిద్దుతున్నారు. రూ.1.35కోట్లను కేటాయించగా, పాఠశాల పూర్వ విద్యార్థి, లారస్ లాబొరేటరీస్ యజమాని చావా సత్యనారాయణ రూ.3.65కోట్లను పాఠశాలకు వితరణ చేశారు. ఈ నిధులతో పాఠశాలలో 16అదనపు తరగతి గదుల నిర్మాణం, విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవసరమైన అన్నిరకాల మౌలిక వసతులు కల్పిస్తున్నారు.

డీబీటీ ద్వారా రూ.31.79కోట్లు..
సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే అన్ని వర్గాల ప్రజలకు మేలు చూకూరాలనే సదుద్దేశంతో నవరత్న పథకాలను అమలు చేశారు. ఆ పథకాల ద్వారా కులం, మతం, పార్టీ అనే తేడా లేకుండా అర్హతను బట్టి అందరికీ ప్రభుత్వం మంజూరు చేసింది. నేరుగా లబ్ధిదారుని ఖాతాలో జమ చేసే పద్ధతి (డీబీటీ) ద్వారా గ్రామంలోని 10,028 మంది లబ్ధిదారులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం రూ.31.79కోట్లను అందజేసింది.

నాన్ డీబీటీ పద్ధతి ద్వారా..
ఇంటి స్థలాలు, జగనన్నకాలనీ ఇళ్లు, ఎనిమిదో తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబులు, 3,702 మంది లబ్ధిదారులకు జగనన్న గోరుముద్ద, జగనన్న సంపూర్ణపోషణ, వైఎస్సార్ కంటి వెలుగు, ఇంటింటికీ రేషన్, నాడు–నేడు పథకం, రోడ్లు, గ్రామ సచివాలయాల భవనాల నిర్మాణం పనుల కోసం కలిపి మొత్తం గ్రామానికి నాన్ డీబీటీ రూపంలో 13.38కోట్ల మేర లబ్ధి చేకూరింది. గ్రామానికి సీఎం జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా మొత్తం రూ.45.17కోట్ల మేర లబ్ధిచేకూరడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

సచివాలయం ద్వారా సేవలు..



ప్రభుత్వం మంజూరు చేసిన కోట్ల రూపాయల నిధులతో గ్రామంలో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం చేశాం. బోరు పంపులు ఏర్పాటు చేశాం. పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, వసతులు సమకూర్చాం. అంగన్‌వాడీ భవనాలు నిర్మించారు. గ్రామసచివాలయం ద్వారా పౌరసేవలందిస్తున్నాం. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా పనిచేస్తున్నాం.

సుబ్రహ్మణ్యం,
పంచాయతీ కార్యదర్శి

సీఎం జగన్ చలువతోనే..



గత టీడీపీ ప్రభుత్వ హయాంలో గ్రామంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదు. సమస్యలన్నీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉన్నాయి. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మాగ్రామం ఎంతో అభివృద్ధి చెందింది. సీఎం జగన్‌కు గ్రామమంతా రుణపడి ఉంటుంది.

షేక్ మొయినుద్దీన్‌బీ,
సర్పంచి, మోగులూరు

225 మందికి ఇళ్లు..



ప్రభుత్వ నిధులు రూ.1.20కోట్లతో నాలుగున్నర ఎకరాల భూమిని కొనుగోలు చేసి 225మందికి జగనన్నకాలనీలో ఇళ్లస్థలాలు ఇచ్చాం. జలజీవన్ మిషన్ కింద ప్రభుత్వం రూ.1.15కోట్లను మంజూరు చేసింది. రైతులను అన్ని విధాలుగా ఆదుకున్న ముఖ్యమంత్రి జగనన్నను ఎన్నటికి మర్చిపోము.

బండి మల్లికార్జునరావు,
వైస్ ఎంపీపీ

నేడు ఇళ్ల పట్టాల పంపిణీ

జగ్గయ్యపేట అర్బన్: జాతీయ రహదారిపై ఆటోనగర్ వద్ద నిర్మించిన హైవే బస్టాండ్‌ను సోమవారం ఉదయం పదిగంటలకు ప్రభుత్వ విప్ ఉదయభాను ప్రారంభిస్తారని ఆయన కార్యాలయ ప్రతినిధి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం మూడుగంటలకు స్థానిక మార్కెట్ యార్డులో తొర్రగుంటపాలెంతోపాటు పట్టణంలోని 1440మంది జగనన్న ఇళ్ల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసిన పట్టాలను పంపిణీ చేస్తారన్నారు. అనంతరం అక్కడే వలంటీర్లకు వందనం కార్యక్రమానినిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

సిమెంటు రోడ్డు ప్రారంభం



చందర్లపాడు(నందిగామ టౌన్): గ్రామీణ ప్రాంతాలలోని అంతర్గత రహదారులను ప్రాధాన్యతాక్రమంలో సిమెంట్ రోడ్లుగా అభివృద్ధి చేస్తున్నానని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. చందర్లపాడు మండలం గుడిమెట్లలో ఎన్ఆర్‌యూఎం నిధులు రూ.10లక్షలతో ఆర్‌అండ్‌బీ రహదారి నుంచి జిల్లాపరిషత్ పాఠశాల వరకు నిర్మించిన సిమెంటురోడ్డును ఆదివారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే జగన్ మోహనరావు మాట్లాడుతూ రోడ్డు సరిగాలేక విద్యార్థులు ఇబ్బందులు పడుతుండటంతో సిమెంటురోడ్డు నిర్మాణం చేపట్టినట్లు వివరించారు. ఎంపీపీ గుడేటి నాగమల్లేశ్వరి, జెడ్పీటీసీ సభ్యుడు ముక్కపాటి నరసింహారావు, ఆల ప్రభు, బత్తిన వెంకటేశ్వరరావు, తిరుపతిరావు, వైఎస్ఎన్ ప్రసాద్, కందుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మల సాధికారితే జగనన్న లక్ష్యం



చందర్లపాడులో నమూనా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

చందర్లపాడు(నందిగామ టౌన్): అక్కచెల్లెమ్మల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. చందర్లపాడులో ఆదివారం వైఎస్సార్ చేయూత నాలుగోవిడత పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మండలంలోని 3217మంది మహిళలకు రూ.6.03కోట్ల నమూనా చెక్కును ఎమ్మెల్యే జగన్‌మోహనరావు అందజేశారు. ముందుగా మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం చిత్తశుద్ధితో పనిచేసిన ప్రభుత్వం మరొకటి లేదన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు తనపాలనలో అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలుచేయలేదన్నారు. ఓట్లు దండుకునేందుకు 2019ఎన్నికలకు కొద్దిరోజులు ముందు పసుపుకుంకుమ పేరుతో హడావుడి చేశారని గుర్తుచేశారు. ఈ నాలుగేళ్లలో వైఎస్సార్ చేయూత ద్వారా సీఎం జగనన్న ప్రభుత్వం ఒక్కో మహిళలకు రూ.75వేలు అందించినట్లు వివరించారు. ఈ నగదును ఉపాధి అవకాశాల కోసం వినియోగించి ఆర్థికాభివృద్ధిని సాధించాలని సూచించారు. అనంతరం గ్రామంలోని జగనన్నకాలనీలో ఇళ్లస్థలాలు పొందిన లబ్ధిదారులకు ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను ఎమ్మెల్యే జగన్‌మోహనరావు పంపిణీ చేశారు. ఎంపీపీ గుడేటి నాగమల్లేశ్వరి, జెడ్పీటీసీ సభ్యుడు ముక్కపాటి నరసింహారావు, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ మండల కన్వీనర్ కందుల నాగేశ్వరరావు, సర్పంచులు కస్తాల పున్నమ్మ, మోహన్‌రెడ్డి, నాయకులు వెలగపూడి వెంకటేశ్వరరావు, వైఎస్ఎన్ ప్రసాద్, శాఖమూరు వెంకటకుమారి, బుగ్గినేని సురేష్, పెరమసాని నరసింహారావు, చావల రవిబాబు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే బీసీలకు న్యాయం

బీసీ సంఘం నాయకులు



నందిగామ: రాష్ట్రంలో బీసీలకు పెద్దపీట వేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందని బీసీసంఘం జిల్లా అధ్యక్షుడు పోతురాజు అంజిబాబు అన్నారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఆదివారం బీసీ సంఘం ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈసందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ ఇప్పటివరకు ఏప్రభుత్వ హయాంలోనూ బీసీలకు న్యాయం జరగలేదన్నారు. బీసీలను కేవలం ఓటుబ్యాంకుగానే చూశాయన్నారు. బీసీలను సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాత్రమే గుర్తించి అన్నిరంగాల్లో పెద్దపీట వేస్తున్నారన్నారు. బీసీలకు సామాజిక న్యాయం వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమైందన్నారు. సామాజికన్యాయాన్ని చేతల్లో చూపెట్టిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని పేర్కొన్నారు. స్థానిక బీసీ నాయకులు పాల్గొన్నారు.

ఎడ్ల పూటీ లాగుడు పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను



పోటీలను తిలకిస్తున్న ప్రజలు

నందిగామ: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని దాములూరు కూడలి సంగమేశ్వరస్వామి ఆలయం, రైతు కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎడ్ల పూటీ లాగుడు పోటీలను ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ పశుపోషణ మన జీవన విధానమని పేర్కొన్నారు. పోటీలను ఏర్పాటు చేసిన రైతు కమిటీ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్, ఆలయ చైర్మన్ కనగాల వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు దేవినేని రామారావు, నాదెండ్ల నాని, మేడా కోటేశ్వరరావు, కొల్లూరు ఉమా, రమేష్, కొలకలూరు వెంకటేశ్వరరావు, పెద్దసంఖ్యలో రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

రసవత్తరంగా పోటీలు..
ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల పూటీ లాగుడు పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. రెండురోజులపాటు నిర్వహించే ఈ పోటీల్లో తెలుగు రాష్ట్రాల నుంచి మొత్తం 18జతల ఎడ్లు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సీఎం జగన్ గెలిస్తే పేదలకు మేలు



రామన్నపేటలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

చందర్లపాడు(నందిగామ టౌన్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి అధికారంలోకి వస్తే రాష్ట్రంలోని పేదలకు మరింత మేలు చేకూరుతుందని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని రామన్నపేటలో ఆదివారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గ్రామస్తుల యోగక్షేమాలతోపాటు వారి ఇబ్బందులను అడిగితెలుసుకున్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న ఆయా సంక్షేమ పథకాలను వివరించి, ఆయా పథకాల అమలుతేదీలతో కూడిన క్యాలెండర్‌ను గ్రామస్తులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహనర్‌రెడ్డి చేయగలిగినదే చెబుతారని.. చెప్పింది మాత్రం తప్పకుండా చేసి చూపుతారని కొనియాడారు. ప్రజలకు మంచి చేయడమే లక్ష్యంగా పని చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచి రానున్న ఎన్నికల్లో ఘనవిజయాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆల ప్రభు, బత్తిన వెంకటేశ్వరరావు, వైఎస్ఎన్ ప్రసాద్, కన్నెకంటి సజ్జనరావు, కర్ల తిరుపతిరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

రూ.కోటితో హైవే బస్టాండ్ నిర్మాణం



ఆటోనగర్ వద్ద నిర్మించిన హైవే బస్టాండ్



హైవే బస్టాండ్‌ను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

- పేట ప్రజల దశాబ్దాల కల సాకారం
- నేడు బస్టాండ్‌ను ప్రారంభించనున్న విప్ ఉదయభాను
- హాజరుకానున్న ఆర్టీసీ ఎండీ

జగ్గయ్యపేట అర్బన్: దశాబ్దాలుగా జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రజల చిరకాల స్వప్నమైన హైవే బస్టాండ్ నిర్మాణం నెరవేరింది. పట్టణ సమీపంలోని హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై ఆటోనగర్‌లో ఫుడ్‌ప్లాజా వెనుక ఏపీఐఐసీకి చెందిన ఎకరం స్థలంలో రూ.1కోటితో హైవే బస్టాండ్ నిర్మాణాన్ని పూర్తిచేశారు. నూతన హైవే బస్టాండ్ నిర్మాణంలో ప్రయాణికుల వెయిటింగ్ హాలు, ఆరు ప్లాట్‌ఫాంలు, పార్సిల్ విభాగం, మరుగుదొడ్ల నిర్మాణం చేశారు. ఎలక్ట్రికల్ బస్సులకు సౌకర్యంగా ఉండేందుకుగాను బస్టాండ్ భవనం ప్రక్కనే ఎలక్ట్రికల్ చార్జింగ్ పాయింట్ ఏర్పాటు చేస్తున్నారు. తద్వారా భవిష్యత్‌లో హైవేపై రాకపోకలు సాగించే ఎలక్ట్రికల్ బస్సులకు ఈ ప్రాంతంలో చార్జింగ్ పాయింట్ ఎంతో ఉపయోగపడటంతోపాటు ఆర్టీసీ సంస్థకు రాబడి రానుంది. ఈ ఆర్టీసీ హైవే బస్టాండ్‌ను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు సోమవారం ప్రారంభించనున్నారు.

తొలగనున్న ప్రజల కష్టాలు..
నియోజకవర్గ కేంద్రంగా ఉన్న జగ్గయ్యపేట పట్టణ జనాభా సంఖ్య 70వేలు దాటింది. పారిశ్రామికంగా రోజురోజుకు ఎంతోఅభివృద్ధి చెందుతున్న జగ్గయ్యపేటతోపాటు నియోజకవర్గవ్యాప్తంగా సుదూర ప్రాంతాలకు వెళ్లేందుకు ఇక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జగ్గయ్యపేట పట్టణం జాతీయ రహదారికి రెండు కిలోమీటర్ల లోపలకు ఉండటంతో హైదరాబాద్, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం వెళ్లే బస్సులు హైవే నుంచి పేట పట్టణంలోకి రావడం లేదు. దీంతో హైదరాబాద్ వెళ్లాలంటే జగ్గయ్యపేట నుంచి 20కిలోమీటర్ల దూరంలో ఉన్న తెలంగాణలోని కోదాడ వెళ్లాల్సివస్తోంది. తిరుపతి, వైజాగ్, కాకినాడ వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లాలంటే 30కిలోమీటర్ల దూరంలోని జిల్లాలోని నందిగామ పట్టణానికి వెళ్లక తప్పడం లేదు. హైవేపై ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం చేపడితే తప్ప ప్రజల ఇబ్బందులు తప్పవని గుర్తించిన పేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను ఈ మేరకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రూ.కోటితో హైవేపై బస్టాండ్ నిర్మాణం చేయించారు. దీంతో విజయవాడ–హైదరాబాద్ మార్గంలో వెళ్లే బస్సులన్నీ ఇక్కడ ఆగనున్నాయి. దీంతో దశాబ్దాలుగా పడుతున్న ఇబ్బందులు తప్పినట్లేనని జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

బస్టాండ్ పరిశీలన

జగ్గయ్యపేట అర్బన్: జాతీయ రహదారిపై ఆటోనగర్ వద్ద నిర్మించిన హైవే ఆర్టీసీ బస్టాండ్‌ను సోమవారం ఉదయం ప్రారంభించనున్న నేపథ్యంలో ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను ఆదివారం పరిశీలించారు. ఉదయభాను మాట్లాడుతూ విజయవాడ–హైదరాబాద్ మార్గంలో నడిచే ప్రతి బస్సు ఇక్కడ ఆగుతుందని తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కల నెరవేరింది..



పేట నుంచి హైదరాబాద్, విశాఖపట్నం ప్రాంతాలకు వెళ్లేందుకు ఇక్కడ బస్సులు ఆగకపోతుండటంతో దశాబ్దాలుగా ఇబ్బందిపడుతున్నాం. ఎమ్మెల్యే ఉదయభాను కృషితో ఇప్పుడు హైవే వద్ద ఆర్టీసీ బస్టాండ్ నిర్మించడంతో ఇకనుంచి ఈమార్గంలో నడిచే బస్సులన్నీ ఇక్కడ ఆగుతాయి. హైవేపై బస్టాండ్ ఉండాలన్న మా కల నెరవేరింది.

– కనిగిరి సుబ్బారావు,
జగ్గయ్యపేట

బస్టాండ్ వరకు పట్టణాభివృద్ధి..



హైవే మార్గంలో సుదూరప్రాంతాలకు వెళ్లే బస్సులు పేటలోకి రాక ప్రజలు ఇబ్బందిపడుతుండటంతో రూ.కోటితో హైవేపై బస్టాండ్ నిర్మాణం చేపట్టాం. ఇకనుంచి అన్నిరకాల బస్సులు ఇక్కడ ఆగుతాయి. బస్టాండ్ నిర్మాణం పూర్తికావడంతో జాతీయ రహదారి వరకు పేట పట్టణం త్వరితగతిన విస్తరిస్తుంది. ఈ మేరకు తగిన ప్రణాళికలు రూపొందించాం.

– సామినేని ఉదయభాను,
ప్రభుత్వ విప్

రాష్ట్రంలో ప్లంబింగ్ సేవల అభివృద్ధికి కృషి

ఏపీ అర్బన్ గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఎండీ రాజశేఖరరెడ్డి

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో ప్లంబింగ్ నిపుణుల సేవలు వృద్ధి చెందేలా తనవంతు కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ అర్బన్ గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ రాజశేఖరరెడ్డి అన్నారు. ఇండియన్ ప్లంబింగ్ అసోసియేషన్ అమరావతి చాప్టర్ ఇన్‌స్టాలేషన్ కార్యక్రమం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ఎంజీరోడ్డులోని ఓ హోటల్‌లో ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ తాను డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా ఉన్నప్పుడు జల వనరుల పునరుజ్జీవానికి, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ఎలా అమలు చేశారో తెలిపారు. అసోసియేషన్‌కు అవసరమైనప్పుడు తన మద్దతు అందిస్తానని పేర్కొన్నారు. అనంతరం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ సందీపని వజ్జె మాట్లాడుతూ నీటి సంరక్షణ ఆవశ్యకతను వివరించారు. నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసిన వారిలో కార్యదర్శి కిరణ్ పర్చూరీ, వైస్ చైర్మన్ బి.ఆనంద్‌బాబు, కోశాధికారి పి.అనూష, సంయుక్త కార్యదర్శి ఆర్.కోమల్ గిల్డా, కార్యనిర్వాహక సభ్యులు రవికిరణ్ గోగినేని, వెంకటేశ్వరరావు రావిపూడి తదితరులు ఉన్నారు. నారెడ్కో, క్రెడాయ్, బీఏఐ వంటి నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

త్రిశక్తి పీఠంలో సామూహిక చండీహోమం
కృష్ణలంక(విజయవాడ తూర్పు): బస్టాండ్ సమీపంలోని శ్రీ కాళీమాత అమ్మవారి దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో అమ్మవారు ఆదివారం కాళీమాతగా దర్శనమిచ్చారు. మాఘమాసం ఆదివారం అమావాస్య కావడంతో ఆలయ ఆవరణంలో పండితుడు మార్తి సూర్యప్రకాష్ శర్మ ఆధ్వర్యంలో సామూహిక చండీహోమం నిర్వహించారు. ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు జి.పుల్లయ్య, కె.జగదీష్ కుమార్, పాల్గొన్నారు.